క్లుప్తంగా

బహిరంగ వేలం 7కు వాయిదా

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో గురువారం జరగాల్సిన బహిరంగ వేలానికి సంబంధించి ఎవరూ హాజరు కానందున ఈ నెల 7కు వాయిదా వేసినట్టు జెడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. ఆ రోజున ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ వేలంలో ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము డ్రాఫ్ట్ లేదా చెక్కు రూపంలో చెల్లించి పాల్గొనాలని కోరారు. ఈ వేలంలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31 వరకు 3వ వార్డు పరిధిలోని రోడ్డు మార్జిన్, లాల్ బహదూర్ శాస్త్రి, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్ల నుంచి రోజు వారీ అశీళ్లు వసూలు చేసుకోవచ్చన్నారు. అలాగే బీచ్‌రోడ్డులోని దుకాణాలు మూడేళ్ల లీజు పరిమితికి సంబంధించి వేలం నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

జ్యూట్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం వెంటనే బకాయిలు చెల్లించాలని ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు కోరారు. కార్మిక సంఘాల ప్రతినిధుల తరపున అల్లు బాబూరావు, మునకాల ఆదినారాయణ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, మద్దుల దేవుళ్లు, చిల్ల ఆదినారాయణరెడ్డి మిల్లు గేటు వద్ద గురువారం మాట్లాడారు. కార్మికులకు రూ.4 కోట్ల బకాయిలు, ఉద్యోగులకు రూ.1.29 కోట్ల ఫిక్సిడ్ డిపాజిట్లు యాజమాన్యం చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని చెల్లించే వరకు మిల్లు ఆస్తులు విక్రయించకూడదని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ చంద్రంపాలెం 11 కేవీ ఫీడర్ నందు నిర్వహణ, మరమ్మతులు, వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు చంద్రంపాలెం, మధురవాడ మెయిన్‌రోడ్, దుర్గానగర్ – 1, దుర్గానగర్ – 2, కృష్ణానగర్, పోర్టుకాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వినియోగదారులు, ప్రజలు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.


ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి కల్లివానిపాలెంలో గత వారం రోజులుగా గాయత్రి విద్యాపరిషత్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం గురువారం ముగిసింది. స్వయం ఉపాధిపై, మహిళా సాధికారత, మహిళా సంరక్షణ, బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించినట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఇ.జగదీశ్వరరావు తెలిపారు.

ముగ్గురు అమ్మవార్ల సన్నిధిలో బొత్స ఝాన్సీలక్ష్మి పూజలు



ముత్యమాంబకు మొక్కుకుంటున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

తగరపువలస: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి గురువారం సాయంత్రం సంగివలస ముగ్గురు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పోలమాంబ, ముత్యమాంబ, మరిడిమాంబకు కుంకుమ పూజలు చేసి చీరలు సమర్పించారు. ఆమెతో అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణ శర్మ, నాగేశ్వరరావు పూజలు చేయించారు.

ఇష్టారాజ్యంగా వాహనాల నిలిపివేత



తాతా థియేటర్ డౌన్ రోడ్డు మధ్యలో నిలిపి టైర్లు అన్‌లోడ్ చేస్తున్న వాహనం



సంతపేటలో ఓ హోటల్ ముందు ఇతర వాహనాలకు అడ్డంగా వ్యాను

తగరపువలసలో రాకపోకలకు అవస్థలు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ తగరపువలస మెయిన్ రోడ్డు, దాని చుట్టుపక్కల రహదారులపై వాహనాల రాకపోకలకు మిగిలిన వాహనాలే అడ్డంకిగా మారుతున్నాయి. ఇష్టం వచ్చినట్టు ప్రయాణికుల కోసం రహదారి మధ్యలో ఆటోలు, క్యాబ్‌లు నిలిపేస్తున్నారు. అంతేకాకుండా సరకు రవాణా వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ పగటివేళ కూడా నిరంతరాయంగా సాగుతోంది. దీంతో నిత్యం మిగిలిన వారు ఈ రహదారులు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కగా వాహనాలు నిలిపి చేయాల్సిన పనులు రోడ్డు మధ్యలోనే నిలిపివేసి చేయడంతో పలువురి సమయం వృథా అవుతోంది. ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేతే తలనొప్పి కలిగిస్తుంటే దీనికితోడు మొత్తం రహదారులను చిరు వ్యాపారస్తులు, బడా వ్యాపారులు ఆక్రమించేశారు. వీరికి చెందిన వ్యాపార వస్తువులు సగం రహదారులను మింగేశాయి. దీంతో నిత్యం బంగ్లామెట్ట నుంచి ఈఎస్ఐ ఆస్పత్రి వరకు ప్రధాన రహదారి స్తంభించిపోతుంది. అలాగే తాతా థియేటర్ డౌన్ నుంచి భీమిలి రోడ్డు, అంబేడ్కర్ కూడలి నుంచి చిల్లపేట చెరువు, సంతబయలు రహదారి, డీసీఆర్ నుంచి గాంధీబొమ్మ, పాత లోకల్ ఆఫీసు వీధి, ఆదర్శగర్ – సంతపేట రహదారి నిత్యం వాహనాల నిలిపివేతతో నిండిపోతున్నాయి.

వ్యాపారాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

రహదారుల విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతీసారి స్థానికులు, వ్యాపారులు ఆందోళన చెందుతుంటారు. తమ వ్యాపారాలు కోల్పోతామని ప్రాధేయపడుతుంటారు. అలాంటి వారే నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. పగటివేళ భారీ వాహనాలకు తగరపువలస, చిట్టివలసలోకి ప్రవేశం లేకపోయినా నిత్యం పదుల సంఖ్యలో బియ్యం, నూనెలు, సిమెంట్, ఐరన్, అరటి, కూరగాయలు, హార్డ్‌వేర్, ఫర్నీచర్ తీసుకొచ్చే తదితర వాహనాలు రహదారులపైనే తిష్ట వేస్తున్నాయి. ఇక వివిధ ప్రాంతాల్లో హోటల్ బ్రాంచ్‌లు నిర్వహించే వారు తమ వాహనాలను ఎక్కడిపడితే అక్కడ నిలిపి వేస్తున్నారు. ఇది చాలదన్నట్టు మెకానిక్‌లు, కర్రీ పాయింట్లు, దుస్తుల షాపులు, రెస్టారెంట్లు, ఫర్నీచర్ దుకాణాలకు పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో రహదారిపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాదిగా వచ్చే వివిధ విద్యాసంస్థల బస్సులు ఎదురెదురు పడితే తప్పించుకుని వెళ్లడానికి 10 నుంచి 30 నిమిషాల సమయం పడుతోంది. ఈ ట్రాఫిక్ కష్టాలను దృష్టిలో ఉంచుకుని భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో రహదారులపై వాహనాలు నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.



మెయిన్‌రోడ్డు మధ్యలో ఆటో నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్న డ్రైవర్



ప్రైవేటు మార్కెట్ వద్ద సిటీ బస్సుకు అడ్డంగా రహదారి మధ్యలో నిలిపిన ఆటో

విద్యార్థినికి అభినందనలు



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.మౌనికను కళాశాలలో గురువారం అభినందించారు. మండలంలోని రాయపాలెం గ్రామానికి చెందిన మౌనిక త్వరలో జరగబోయే జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల నెట్ బాల్ పోటీలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఇటీవల విశాఖ ఏవీఎన్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఈమె ఎంపికైంది. ఈ మేరకు కళాశాలలో మౌనికను ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే ఇతర విద్యార్థినులంతా ఈమెను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో శిక్షణ పొంది ప్రతిభ చూపాలని కోరారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ గౌరీశంకర్, అధ్యాపకులు డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



జీవీఎంసీ చైన్‌మెన్ సూర్యనారాయణను సత్కరిస్తున్న జెడ్సీ శైలజావల్లి, తదితరులు



ఉపాధ్యాయురాలు జానకి దంపతులను సత్కరిస్తున్న హెచ్ఎం రాజబాబు, తదితరులు

మధురవాడ : జీవీఎంసీ అభివృద్ధిలో అధికారులతో పాటు చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని జోన్ – 2 కమిషనర్ శైలజావల్లి అన్నారు. పదవీ విరమణ చేసిన టౌన్‌ప్లానింగ్ విభాగం చైన్‌మేన్ కె.సూర్యనారాయణను గురువారం సాయంత్రం ఆమె చాంబర్‌లో ఏసీపీ శభ్‌నాన్‌శాస్త్రితో కలిసి సత్కరించారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించే సూర్యనారాయణ వంటి వారు లేని లోటు పూడ్చలేనిదన్నారు.

• చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు వి.జానకి దంపతులను ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. సోషల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దడం, మంచి ఫలితాల సాధనలో ఆమె పాత్ర ఎంతో వుందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా లాంజ్ ప్రారంభం



లాంజ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

కొమ్మాది: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫిష్ ఆంధ్ర – ఫిట్ ఆంధ్ర నినాదంతో మత్స్యకారులకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా లాంజ్ యూనిట్‌ను జీవీఎంసీ 4వ వార్డు బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న చక్కటి అవకాశమన్నారు. ఈ లాంజ్‌ను మత్స్యశాఖ తరపున మంజూరు చేస్తారని, లాంజ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం కేటాయించగా, లబ్ధిదారులు 40 శాతం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు షేక్ లాల్ మహమ్మద్, ఏడీ విజయ కృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ పి.కృష్ణ, ఎఫ్‌డీవోలు డి.మురళి, లావణ్య, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

180 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు దుర్గా కల్యాణి

తగరపువలస : భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో అన్నవరం, పైలపేట గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180 మంది విద్యార్థులకు సివిల్ అసిస్టెంట్ సర్జన్ వై.దుర్గాకల్యాణి ఆధ్వర్యంలో గురువారం వైద్యసేవలు అందించారు. అనంతరం ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దివీస్ లేబొరేటరీ యాజమాన్యం సహకారం అందించింది. సర్పంచ్ మేరుగు సంతోషికుమారి, ఉప సర్పంచ్ సూకరాజు, మేరుగు ఎల్లాజీ, దివీస్ సామాజిక సేవాధికారులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

‘తిరుపతికి అదనపు రైళ్లు నడపండి’

తగరపువలస : సాధారణ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని వేసవి రద్దీ కారణంగా విశాఖపట్నం నుంచి తిరుపతికి అదనపు రైళ్లు, జనసాధారణ రైళ్లు నడపాలని సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు ఆయన రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు గురువారం వినతిపత్రం పంపించారు. మూడు నెలలు ముందుగానే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు స్లీపర్ బోగీల రిజర్వేషన్ పూర్తయిపోతుందన్నారు. అలాగే ఈ రైలుకు స్లీపర్ బోగీలు తగ్గించేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, వాటిని పెంచాలని కోరారు.

సివిల్ ఇంజినీర్లకు అపార అవకాశాలు



సాయిబాబాను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: ప్రభుత్వాలు మెట్రో రైలు ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, జాతీయ రహదారుల విస్తరణపై దృష్టి సారించడంతో సివిల్ ఇంజినీరింగ్ నిపుణులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని జాతీయ ప్రాజెక్టు నిపుణులు డాక్టర్ సాయిబాబా అన్నారు. గీతంలో గురువారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సివిల్ ఇంజినీరింగ్ అంటే భవన నిర్మాణం కాదని, సృష్టికి ప్రతి సృష్టి చేయడమని, సాంకేతికంగా దేశాన్ని ఉన్నత స్థానంలో నిలపడమన్నారు. సముద్రాలపై నిర్మించే వంతెనలు, అటవీ ప్రాంతాల్లో కొండలను తొలిచి నిర్మించే రైల్వే టన్నల్స్, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, నీటిని నిల్వ చేసే ఆనకట్టలు సివిల్ ఇంజినీరింగ్ గొప్పతనాన్ని తెలియజేస్తాయన్నారు.

టీడీపీ నీచమైన ఉచ్చులో దళితులు చిక్కుకోవద్దు

వైఎస్సార్ సీపీ దళిత నాయకులు



విల్సన్‌పేట అంబేడ్కర్ సామాజిక భవనంలో మాట్లాడుతున్న నాయకులు

తగరపువలస: దళితుల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకునేందుకు కొందరు టీడీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలకు ఎవరూ తలొగ్గవద్దని, వారి నీచమైన ఉచ్చులో చిక్కుకోవద్దని జీవీఎంసీ భీమిలి జోన్ వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. చిట్టివలస కార్మికవాడ విల్సన్‌పేట అంబేడ్కర్ సామాజిక భవనంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న అధ్యక్షతన పలువురు దళిత నాయకులు గురువారం మాట్లాడారు. ఎస్సీ సబ్ ప్లాన్‌ను పదేళ్లపాటు పెంచింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. దళితుల స్థలాలు ఇప్పటి వరకు ఎవరూ కబ్జా చేయలేదని, అలాంటిదే జరిగితే తామంతా ఒక్కటవుతామన్నారు. కబ్జాలపై టీడీపీ నాయకులు చెప్పడం, పచ్చ పత్రికలు చిలువలు పలవలు చేసి రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొండపేట సర్వే నంబర్ 28లో అంబేడ్కర్ భవన్‌కు 48 సెంట్ల స్థలం ఉందన్నారు. దీనికి సర్వే చేయించి ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఇక్కడ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇప్పటికే రూ.30 లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. దళితులను అడ్డం పెట్టుకుని భీమిలి రూరల్, భోగాపురం మండలాలకు చెందిన నాయకులు జీవీఎంసీలో నీచానికి దిగజారడం దారుణమన్నారు. ఇకపై అయినా దళితుల సమస్యల పేరుతో రాజకీయాలు చేయడం సామంతుల సత్తిరాజు వంటి వారికి తగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, పందిరి విజయ్, గంట్రేటి ఈశ్వరరావు, బుడుమూరు లక్ష్మణరావు, టొంపల సూరిబాబు, శిరువుడి వెంకటరావు, తానవరపు రవికుమార్, పేడ్డ అప్పారావు, బోని త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు గ్యాస్ స్టౌలు అందిస్తున్న ప్రసాదరావు

ఆనందపురం : పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్ కోరారు. మండలంలోని వెల్లంకి, గారిపేట, వెల్లంకి – 2 గ్రామాలకు చెందిన 20 మందికి ఉజ్వల గ్యాస్ పథకం కింద స్టౌలు మంజూరు కాగా వెల్లంకిలో గురువారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు రూ.600లకే సిలిండర్ అందిస్తున్నామన్నారు. లబ్ధిదారుల ఖాతాలో రూ.300 నగదుని రాయతీ కింద జమ చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సుబ్బరాజు, నాయకులు సాయి రమేష్, నాని, ఇంటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

భీమునిపట్నం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమిలి ఆర్‌డీవో కార్యాలయం ఎదురుగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) భీమిలి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘురాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల పాత బాకాయిలు వెంటనే చెల్లించాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న కళాశాల సిబ్బంది

ఆనందపురం : మండలంలోని కణమాంలో గురువారం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పలరాము మాట్లాడుతూ కళాశాల యాజమాన్యాలు గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించి మౌలిక సౌకర్యాలపై నివేదికలు రూపొందించడం వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు, రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్, డైరెక్టర్ రాజామురుగుదాసు, ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్, పీడీ దిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐకు సత్కారం



సూర్యనారాయణను సత్కరిస్తున్న కమాండెంట్ గౌతమి సాలి

పీఎం పాలెం : పదవీ విరమణ అనంతరం ప్రణాళికాబద్ధమైన జీవన విధానం అలవరచుకుంటే సంతోషంగా జీవించవచ్చని బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్ గౌతమి సాలి అన్నారు. బెటాలియన్‌లో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న బి.సూర్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు గురువారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికి, సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని సూచించారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు వి.నారాయణరావు, సీహెచ్‌వీవీ మల్లికార్జునరావు, పి.సత్యం, ఎస్.దేవానంద్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట టాస్‌పర్క్ కాలనీలో జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో రోడ్ల కోసం, డ్రైనేజీల కోసం అధికారుల చుట్టూ స్థానికులు తిరిగేవారని, ప్రస్తుతం అధికారులు, నాయకులు నేరుగా గ్రామాల్లోకి వచ్చి సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నారన్నారు. 20 రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు చిన్నారావు, మేరుగు అప్పన్న, బడే చిన్నారావు, వాసుపల్లి నర్సింగరావు, దూడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కేఏ పాల్ అడ్డగింత

కొమ్మాది: రుషికొండపై నూతనంగా నిర్మించిన భవనాలను చూసేందుకు ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ గురువారం ఉదయం అక్కడకు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. భవనాలు చూసేందుకు ఎవరికీ అనుమతి లేదని ఆయన వాహనాన్ని అనుమతించలేదు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన భవనాలను చూడకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లిపోయారు.